"హల్లో బాబీ! ఏమిటీ ఇక్కడున్నావు?" మోపెడ్ ఆపి అడిగింది స్వప్న—రోడ్డు ప్రక్కగా తన స్నేహితుడు రమేష్‌తో మాట్లాడ్తున్న దిలీప్‌ని.

దిలీప్‌ని బాగా తెలిసున్న వాళ్ళు 'బాబీ' అనిపిలుస్తారు. ఇంట్లో అతని ముద్దు పేరు అది.

"స్వప్నా! నువ్వా?" అంటూ కొంచెం ముందుకెళ్ళి స్వప్నతో మాట్లాడ్తున్నాడు దిలీప్.

రమేష్ కళ్ళు స్వప్న మీద నిలిచాయి. ఒక కాలు నేలమీద మోపి మోపెడ్ మీద కూర్చున్న స్వప్న దిలీప్‌తో నవ్వుతూ, చనువుగా మాట్లాడుతోంది. ఆమె అందాన్ని చూసి కళ్ళు తిప్పుకోలేకపోయాడు రమేష్. కర్పూరవు బొమ్మలా తెల్లగా, తీరైన అవయవ సౌష్ఠవంతో కనులు చెదిరేటట్టుగా ఉంది స్వప్న.

"బాబీ! నా వాహనం మీద వెళ్దాం రారాదూ!" అంది స్వప్న.

"ఫ్రెండ్ ఉన్నాడు బాగుండదు. నువ్వెళ్ళిపో!" దిలీప్ అన్నాడు.

"ఏమిటీ? అసలు యింటికే రావడంలేదు ఈ మధ్య. ఆదివారం రాకూడదూ! సరదాగా స్పెండ్ చెయ్యొచ్చు!"

"అలాగేలే వస్తాను."

"మరి నేవెళ్ళిరానా? బై!" అంటూ మోపెడ్ స్టార్ట్ చేసి. రివ్వుమంటూ వెళ్ళిపోయింది స్వప్న.

ఇంకొంచెం సేపుంటే ఎంత బాగుండేది... మెరుపులా వచ్చి మాయమయింది అనుకున్నాడు కొంచెం దూరంలో నిలుచున్న రమేష్.

"ఎవరురా ఆ బంగారు చిలక? అదృష్టవంతుడివి సుమా!" దగ్గరకు వచ్చిన దిలీప్‌తో అన్నాడు రమేష్.

"'ఏడిశావ్‌లే! వెధవ ఊహాగానాలూ నువ్వూ! అందమైన అమ్మాయితో మాట్లాడితేనే అదృష్టమనుకోకు. స్వప్న నా కజిన్ సిస్టర్!" చిరుకోపంగా అన్నాడు దిలీప్.

స్వప్న! ఎంత అందమైన పేరు. పేరుకి తగ్గ అందం! స్వప్న నాలాంటి యువకుల కలలోకి వచ్చి కలవరపెట్టే స్వప్నసుందరి అనుకున్నాడు రమేష్.

"నాకూ పరిచయం చెయ్యిగురూ ఆ అమ్మాయిని!" ప్రాధేయ పూర్వకంగా దిలీప్‌ని అడిగాడు.

"ఎందుకు?" సీరియస్‌గా అడిగాడు దిలీప్.

"అధేం ప్రశ్న గురూ!"

"నాకు తెలిసిందిగాని, నీకు పరిచయం చెయ్యడం కుదరదు."

"ఎందుకని?"

"ఒక్క మాట అడుతాను చెప్పు. నువ్వు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటావా?"

"అదెలాగ కుదురుతుంది గురూ!"

"మరి అందుకే పరిచయం చెయ్యడం కుదరదన్నాను."

"అదేమిటి? నాకేం తక్కువ? అందమా? ఫరవాలేదు. ఆస్తా? బాగానే ఉంది. ఎలాగోలా డిగ్రీ కంప్లీట్ చేశాను..."

"ఆ! స్టాప్ అటువంటి అర్హతలు బాగానే ఉన్నాయి. కాని ఒక చిక్కుంది ఇక్కడ."

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు రమేష్.

"ఆ అమ్మాయి కట్నం తీసుకునే వాడిని చచ్చినా పెళ్ళి చేసుకోదట. పంతం పట్టికూర్చుంది."

"హూఁ!" ఉసూరుమన్నాడు రమేష్

"ఇలా పంతం పెట్టుకుంటే నీకెలా పెళ్ళి అవుతుందని వాళ్ళ అమ్మా నాన్నా ఎంత నచ్చచెప్పినా స్వప్న వినడంలేదు. పెళ్ళి అవకపోయినా ఫరవాలేదుగాని, కట్నం యిచ్చి పెళ్ళి మాత్రం వద్దు అని మొండికేసి కూర్చుంది." దిలీప్ చెప్పాడు.

"ఇదేం పంతం? అంతా విచిత్రంగా ఉందే!"

"విచిత్రమేంకాదు. ఈ రోజుల్లో ఆడపిల్లలందరూ వరకట్నానికి వ్యతిరేకులే! కాని కొందరికి తలొగ్గక తప్పడంలేదు. అంతే! స్వప్న ఉద్యోగం చేస్తూ సంపాదించుకుంటుంది గనుక అంత ధీమాగా పంతం పట్టి కూర్చుంది."

' ఆ అమ్మాయి ఉద్యోగం చేస్తూందా?'

"ఆ! మరి...' నేను నెలకి మూడువేల దాకా సంపాదించుకుంటున్నాను. ఇంకా కట్నం యిచ్చి పెళ్ళి చేసుకోవడమా? ఇన్‌సల్ట్!' అంటుంది స్వప్న. డబ్బు మనుష్యులంటే ఆమెకు పరమ అసహ్యం."




ప్రేమ' పేరుతో సన్నిహితమవుతూ కల్లబొల్లి కబుర్లు చెప్పి వివాహమయ్యేవరకూ ఒక విధంగా నటిస్తూ, ఆతర్వాత వారినీ, వారి ఆర్జననూ కబళించి తమ అడుపాజ్ఞల్లో అణగదొక్కాలనుకునే 'పురుష పుంగవులు' రోజురోజుకూ ఎక్కువవుతున్నారు. కానీ ఈనాటి ఆధునిక వనితలు అంత తేలిగ్గా వారి వలలో పడిపోతారా?

దిలీప్ మాటలు విని రమేష్ 'అమ్మో! నెలకి మూడు వేలే!' అని పైకి అనలేదుగాని మనసులో అనుకున్నాడు.

నెలకి మూడు వేలు అంటే... మూడు సంవత్సరాల్లో తన తండ్రి తనకి కట్టిన ఖరీదు, అదే తండ్రి ఆశించిన కట్నం లక్షకి పైగా స్వప్న సంపాదిస్తుందన్నమాట! మనసులోనే లెక్కలు వేసేస్తున్నాడు రమేష్.

కట్నం లేకుండా చేసుకుంటేనేం? లాభం బాగానే ఉంటుంది. స్వప్న తనది అవ్వాలేగాని, అయితే స్వప్న డబ్బు తనది అవదా? ఇద్దరి సంపాదనతో యిద్దరూ సరదాగా, విలాసంగా బ్రతకొచ్చు. నాన్నగారు దయతలచి కక్కుర్తిగా యిచ్చే డబ్బు తన సరదాలకు ఏ మూలకీ రాదు. ఉద్యోగం చేసే అమ్మాయి అయితే ఇంకా మంచిది. ఈ విధంగా సాగుతున్నాయి రమేష్ ఆలోచనలు.

"ఎలాగైనా నాకు పరిచయం చెయ్యరా దిలీప్!"

అతని అర్థింపు చూసి పకపక నవ్వాడు దిలీప్.

"ఏమిట్రా నీ పిచ్చి? అందని వాటిని ఎందుకు ఆశించడం? మీ నాన్న చండశాసనుడు అంటుంటావు. నీకెలాగూ కట్నం గుంజకుండా పెళ్ళి చెయ్యడు. తెలి నుండి ఈ ఆలోచన ఎందుకు నీకు? ఆ అయిడియా డ్రాప్ చేసేసుకో!"

దిలీప్ మాటలు రమేష్‌కి రుచించలేదు.

"నీకెందుకు అదంతా? కాస్త పరిచయం చేసి పుణ్యం కట్టుకోరాదూ! తర్వాత నా పాట్లు నేనుపడతాను."

"లాభంలేదు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. నీ బాధ చూస్తుంటే కొన్నాళ్ళకి మజ్నూలా తయారయ్యేట్టున్నావు. ముందు మీ నాన్నని అడిగి పర్మిషన్ తెచ్చుకో కట్నం లేకుండా నీ పెళ్ళికి. తర్వాత పరిచయం మాట. మరి నే వెళ్తా!"

ఇంకా తనుంటే రమేష్ విసిగిస్తాడనుకుని దిలీప్ అక్కడనుండి వెళ్ళిపోయాడు.

రమేష్ ఉసూరుమంటూ ఇంటికి బయలు దేరాడు.

ఎలా స్వప్నని తన స్వంతం చేసుకోవాలి? బుర్రలో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి.



ఎలాగైతేనేం తండ్రిని ఒప్పించాడు. ఆయన ముందు ఆకాశమంత ఎత్తు ఎగిరాడు.

"ఒక్కో క్లాసు రెండేసి సంవత్సరాలు డింకిలు కొడుతూ చదివిన నిన్ను అంత ఖర్చు పెట్టి ఎందుకు చదివించాననుకున్నావు? కట్నం లేకుండా నీ పెళ్ళి జరగడం అసంభవం. వెధవ్వేషాలు కట్టిపెట్టు!" అని మండిపడ్డాడు.

రమేష్ స్వప్నది పెద్ద ఉద్యోగమని, బాగా సంపాదిస్తుందని చెప్పాక మెత్తబడ్డాడాయన. తను కాదన్నా రమేష్ సాహసించి తీరుతాడని ఆయన భయం కొంత, అయినా ఆ అమ్మాయికి వీడు నచ్చినప్పుడు మాటగదా అన్న ధైర్యం కొంత—ఆయన్ని అంగీకరింపచేశాయి అయిష్టంగానే.

దిలీప్‌ని కలుసుకుని "పర్మిషన్ తెచ్చుకున్నాను. ఇంక నువ్వు పరిచయం చెయ్యడమే ఆలస్యం" అన్నాడు రమేష్.

"ఏం పర్మిషన్?"

"అదేమిట్రా? స్వప్నని పరిచయం చెయ్యమంటే మానాన్న నుండి కట్నం లేకుండా పెళ్ళికి పర్మిషన్ తెచ్చుకోమన్నావుగా! మర్చిపోయావా?" గుర్తు చేశాడు.

"ఓహో! అదా? నువ్వింకా ఆ విషయాన్ని పట్టుకుని వేళ్ళాడుతున్నావన్నమాట. సరేలే! అంతగా పడి చస్తున్నావు గనుక ఒప్పుకుంటున్నాను. వచ్చే ఆదివారం స్వప్న వాళ్ళింటికి వెళ్తాను. నాతో నువ్వూ వద్దువుగానిలే!"

"థాంక్యూ!"

"పరిచయం చెయ్యడం వరకే నా పాత్ర. ఇంక నీ ప్రేమ వ్యవహారంలో నాకేం సంబంధం ఉండదు."

"అలాగే!"

ఆదివారం యిద్దరూ స్వప్న వాళ్ళింటికి వెళ్ళడం, రమేష్‌ని పరిచయం చెయ్యడం జరిగాయి. స్వప్న స్నేహశీలి. బెరుకులేకుండా రమేష్‌తో కూడా ఫ్రీగా మాట్లాడింది. రమేష్ ఉబ్బి పోయాడు.

తర్వాత కూడా స్వప్న ఆఫీసునుండి వచ్చేదారిలో ఎవరి కోసమో వెయిట్ చేస్తున్నట్టు నటించి, కాపువేసి ఆమెతో పరిచయాన్ని పెంచుకున్నాడు.

"స్వప్నా! మీతో మాట్లాడాలి." ఒకసారి కలుసుకున్నప్పుడు రమేష్ అన్నాడు.

"ఇప్పుడు మాట్లాడడం లేదా?" అల్లరిగా కిల కిలా నవ్వింది స్వప్న.

"అది కాదు స్వప్నా! ఒక ముఖ్య విషయం మాట్లాడాలి" నసిగాడు.

"ఓకే! మాట్లాడండి.

"ఇలా నడి రోడ్డుమీద కాదు. సావకాశంగా మాట్లాడాలి."

"సరే! ఆదివారం రండి."

"మీ యింటికా?"

"ఫరవాలేదు. ఆ రోజు ఇంట్లో ఎవరూ ఉండరు. అంతా బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్తారు. మీరు నిస్సందేహంగా రావచ్చు."

ఆదివారం వెళ్ళాడు. స్వప్న చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. టిఫిన్, టీ యిచ్చి మర్యాద చేసింది.

"స్వప్నా! నువ్వంటే నాకు చాలా యిష్టం!" తను మాట్లాడబోయే విషయానికి నాందీ వాక్యంగా అన్నాడు రమేష్.

"నాకూ యిష్టమే!"

"మనిద్దరి యిష్టాలు కేవలం యిష్టాలుగానే ఉండిపోగూడదు. నీకు అంగీకారమైతే..."

స్వప్న అతని మాటని పూర్తి కానివ్వలేదు.

"నాకు కొన్ని ప్రిన్సిపల్స్ ఉన్నాయి." అంది.

"నాకూ ఉన్నాయి." తెలివి ఉపయోగించాడు రమేష్.

"ఏమిటి? చెప్పండి?"

నేను కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఇది నా ముఖ్య ఆశయం."

"వాట్! నిజమా?" ఎగిరి గంతేసినంత పని చేసింది స్వప్న. కట్నం తీసుకోని మగవాళ్ళంటే స్వప్నకి అమిత గౌరవం.

"నిజం!"

"వెరీగుడ్! మీలాంటి సంస్కారవంతులు నూటికి నలుగురున్నా మనదేశంలో ఆడపిల్లల అగచాట్లు తప్పుతాయి. మీకు నా అభినందనలు. యూ ఆర్ రియల్లీ గ్రేట్."

రమేష్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

"అంతే కాదు స్వప్నా! నాకు డబ్బు ముఖ్యం కాదు. అసలు నాకు డబ్బు మనుష్యులంటే చాలా అసహ్యం. ఆడపిల్ల డబ్బుని ఆశించే నీచత్వం మా కుటుంబంలోనే లేదు." డబ్బు మనుష్యులంటే స్వప్నకి అసహ్యం' అని దిలీప్ చెప్పిన మాట గుర్తు వచ్చి అన్నాడు రమేష్. స్వప్నని మెప్పించడానికి ఇదొక ఉపాయం అనుకున్నాడు.

స్వప్న అతని కనులలోకి నిశితంగా, పరిశీలనగా, ఏదో పని గట్టిన దానిలా చూసింది.

"అరె! నేను అడక్కుండానే చెప్పేశారే! నాకు మీ అభిప్రాయాలు బాగా నచ్చాయి."

"మరి... మరి...."

"మరి నా అభిప్రాయాలు కూడా చెప్పాలి గదా!"

"అవును. చెప్పు."

"నన్ను నన్నుగా గౌరవించే వాళ్ళంటేనే నాకిష్టం."

"అంటే?" అర్థం కాలేదు రమేష్‌కి.

"అంటే... నా అందాన్నే కాకుండా నా వ్యక్తిత్వాన్ని గౌరవించాలి. చాలామంది మగవాళ్ళు తామే అధికులమనీ, ఆడదాన్ని అణగద్రొక్కి అధికారం చెలాయించాలనీ చూస్తారు. అదే నాకు నచ్చదు. భార్యా భర్తలు ఒకరి వల్ల ఒకరు సమాన గౌరవంతో మసలుకోవాలి. అదీ నా అభిప్రాయం."

"ఓస్! ఇంతే గదా!" తేలిగ్గా అనేశాడు రమేష్.

"మీరెలాగూ డబ్బు మనుష్యులు కాదంటున్నారు. ఆడపిల్ల నుండి డబ్బుని ఆశించే నీచత్వం మీ ఫామిలీలోనే లేదంటున్నారు. అదే నిజమైతే నా ధన్యవాదాలు. అందుకే నేను, పెళ్లి కాగానే ఉద్యోగం మానేస్తాను."

రమేష్ షాక్ తిన్నట్టయ్యాడు.

"అదేమిటి స్వప్నా! ఉద్యోగం మానడం ఎందుకు? నెలకి మూడు వేల ఉద్యోగం..." వెంటనే నాలిక కరుచు

# సంస్కారం

'ప్రశాంతి'

కున్నాడు తన తెలివి తక్కువతనానికి.

స్వప్న ఒక కంట అతన్ని గమనిస్తూనే ఉంది.

"అరె! నాకు నెలకి మూడు వేల జీతమని మీకెలా తెలును? ఎంక్వైరీ చేసుకునే వచ్చారన్నమాట!"

"అబ్బే! అబ్బే! అది... అది... మరి..." తడబడిపోయాడు.

"నాకు తెలును. మీ తడబాటే చెప్తుంది మీ అంతరంగం ఎటువంటిదో! నాకు మనుష్యుల్ని స్టడీ చెయ్యడం బాగా తెలును. లేని ఆదర్శాన్ని లేని సంస్కారాన్ని ఉందని చెప్పుకుని నన్ను నమ్మించాలని చూశారు కదూ! మగవాడు ధైర్యంగా స్త్రీని వంచించాలని చూస్తాడు. చివరికి తనే వంచితుడౌతాడు. అదే ఆత్మవంచన. మీరు కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారని, అది మీ ముఖ్య ఆశయమనీ అన్నారు. అంతవరకూ నిజమని నమ్మాను. మిమ్మల్ని మనసారా అభినందించాను.

"నేను అడగకుండానే, అనవసర ప్రస్తావనగా, మీకు డబ్బు మనుష్యులంటే అసహ్యమనీ, ఆడపిల్ల డబ్బు ఆశించే నీచత్వం మీ కుటుంబంలోనే లేదన్నారు. అది నాకు నిజంగా తోచలేదు. స్వంత డబ్బా వాయించుకోవడం అనిపించింది. అందుకే పెళ్ళి అయ్యాక ఉద్యోగం మానేస్తాను అని అన్నాను. అలా అంటే మీ ఫీలింగ్స్ ఎలా ఉంటాయో కని పెట్టాలనే అన్నాను. నేను ఊహించినట్టుగా, ఆ మాట విని మీరు స్పృహ తప్పిపోయినంతపని చేశారు. అదీగాక నా మూడు వేల జీతం మీ మనసులో బాగా నిలిచిపోయింది. అందుకే మీకు తెలియకుండానే ఆ మాట బయట పడింది మీ నోటి నుండి. అనేశాక తెలివి తెచ్చుకుని నాలిక కరుచుకున్నారు పాపం!"

స్వప్న తన అంతరంగం బాగా గ్రహించినట్టు మాట్లాడేస్తుంటే రమేష్‌కి నోటమాట రావడం లేదు. అనవసరంగా, అధికంగా మాట్లాడి, మూడు వేల జీతం అని కూడా అనేసి ఇరుకునపడ్డానే అనుకున్నాడు. తన తెలివి తక్కువకి లోలోనే చింతించాడు.

"నాకు నిజంగా ఉద్యోగం మానేసే ఉద్దేశం లేదు. ఇంత సంపాదించుకుంటున్న నేను, ఆ ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోయి ప్రతి ఖర్చుకి భర్తని అడగడం, భర్త దయాదాక్షిణ్యాల మీద ఆధారపడడం నా వ్యక్తిత్వానికే దెబ్బ!" గడగడా మాట్లాడేస్తోంది స్వప్న.

రమేష్‌కి మాట్లాడ్డానికేం లేకుండా పోయింది. స్వప్న సామాన్యమైన ఆడపిల్ల కాదు అనిపించింది అతనికి.

"అది కాదు స్వప్నా..." ఏదో చెప్పాలని చూశాడు.

కాని స్వప్న ఆ అవకాశం యివ్వలేదు.

"ఇంక మీరేమీ చెప్పక్కర్లేదు. పెళ్ళి అయ్యాక భార్యని అధికారంగానైనా నొక్కి పెట్టవచ్చుని మీ నమ్మకం. నాలుగు తన్ని అయినా నా సంపాదన లాక్కోవచ్చుని మీ ఆశ. మీరు నా అందానికి మోజు పడ్డారు. నా సంపాదనకి ఆశపడ్డారు. అంతేగదూ!"

"స్వప్నా! అదేం కాదు. నిన్ను నిజంగానే ప్రేమిస్తున్నాను."

"కాదు. కాదు. ముమ్మాటికీ కాదు. అది ప్రేమ కాదు. ఆకర్షణ. అంతే! ఈ అందం, ఆకర్షణ ఎంతో కాలం ఉండవు. మీ మోజూ ఎంతో కాలం ఉండదు. మీరు నిజంగా నన్ను ప్రేమిస్తే, నేను ఉద్యోగం మానేస్తాననగానే అలా షాక్ అయ్యే వారు కాదు. 'ఓ.కే! స్వప్నా నీయిష్టం' అనే వారు. నిర్మలంగా ప్రేమించే హృదయమే అలా అనిపిస్తుంది. మీరు ప్రేమిస్తున్నది నన్ను కాదు. నా ఉద్యోగాన్ని ఇదీ మీ సంస్కారం!"

"స్వప్నా! నా మాట..."

"నో నో మిస్టర్ రమేష్... ఐ హేట్ మనీ మైండెడ్ పీపుల్. మైండిట్! యు కెన్ గో!" దిగ్గున కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్ళిపోయింది స్వప్న.

అదృష్టం అందినట్టే అంది జారిపోయింది... కాదు. తనే జారవిడుచుకున్నాడు.

తెలివంతా తనదేననుకునే ఆ తెలివి తక్కువ అబ్బాయి తెల్లమొహం వేసుకుని ఇంటి దారి పట్టాడు.

## అశ్లీల ధోరణులు రూపుమాపడానికి వనితలు ఏం చేయాలి?




మహిళాభ్యుదయ సంస్థ (హైదరాబాదు) ఆధ్వర్యంలో డిశంబరు 25 న అశ్లీల ధోరణులపై శ్రీమతి మల్లాది సుబ్బమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. అశ్లీలంపై సరియైన నిర్వచనాన్ని అభిప్రాయాన్ని స్పష్టం చేసుకోవలసిన తరుణం ఆసన్నమయినదని, అసలు అశ్లీలతకు, అసభ్యతకు, బూతుకు తేడాలున్నాయని సుబ్బమ్మగారు వివరించారు. స్త్రీని చులకనగా చూసే సంస్కృతి వల్లే ఆమెను 'మోడల్'గా రకరకాల భంగిమల్లో వ్యాపారస్తులు వాడుకుంటున్నారని దీనికి నిరసనగా మహిళలంతా ఏకమై పోరాడాలని శ్రీమతి సుబ్బమ్మ విజ్ఞప్తి చేశారు. సామాజిక కార్యకర్త శ్రీమతి అవుల జయప్రదాదేవి తమ ముఖ్యోపన్యాసంలో—కాముక ప్రవృత్తి, జుగుప్స కలిగించేది అశ్లీలత అని నిర్వచించి ఆచారాల మార్పుతో అశ్లీలత వల్ల భావాలు రకరకాలుగా పరిణామం చెందుతున్నాయని ఆమె అన్నారు. ప్రముఖ న్యాయవాది శ్రీప్రతాపరెడ్డి సాహిత్యంలో, చిత్రాలలో స్త్రీని చులకనగా చూపే విధానాన్ని విమర్శించి, స్త్రీ పురుష సన్నిహిత అంతరంగిక సంబంధాలను బహిర్గతం చేయటం అవసరమా? అని ప్రశ్నించారు.

చర్చ మూడు విభిన్న సమావేశాలలో సాగింది. ప్రథమ సమావేశానికి శ్రీమతి తురగా జానకిరాణి అధ్యక్షత వహించారు. స్త్రీలు పత్రికా సంపాదకులుగా వుంటే అశ్లీలతతో నిండిన కథలు, నవలలు రావని భావించటం పొరపాటని ఆమె అన్నారు. శ్రీమతి మమతా-లక్ష్మన్న యువతీ యువకులలో సెక్సు విద్యపై గల ఆసక్తిని వివరిస్తూ అశ్లీలత దేశ కాలాలపై ఆధారపడుతుందని ఆమె చెప్పారు. అశ్లీలత సామాజిక భావన అని, పురుష ప్రపంచం స్త్రీని ఆట వస్తువుగా చిత్రించిందని శ్రీమతి రేఖా పాండే స్పష్టీకరించారు. శ్రీమతి జె.కామేశ్వరి సమాజంలో ప్రాధాన్యం వహిస్తున్న సాంస్కృతిక ధోరణులకు ప్రాముఖ్యం వున్నదని చెప్పారు. దాసరి మంజులత తన ఉపన్యాసంలో నలుగురి ముందు చదవటానికి, వినటానికి, చూడటానికి, అనువు కానిది, సిగ్గును, జుగుప్సను కలిగించేదే అశ్లీలం అని అన్నారు.

రెండవ సమావేశానికి శ్రీమతి పద్మావతి శర్మ అధ్యక్షత వహించారు. కుటుంబ పరిస్థితులు, తతిమ్మా పరిస్థితులు సరిగా వుంటే అశ్లీలత ఏ దుష్ప్రభావాన్ని కలుగ జేయలేదనే భావాన్ని వ్యక్తీకరించారు శ్రీమతి జి.భారతి. విమల్ బాల సుబ్రహ్మణ్యం 1986 స్త్రీ రూప అసభ్య చిత్రీకరణ శాసనాన్ని విమర్శించారు. శ్రీమతి ఎం.రాధ వస్తువుల కొనుగోలును ప్రోత్సహించే ప్రకటనలలో స్త్రీ రూపాన్ని వ్యాపార దృష్టితో వాడుకోవడాన్ని నిరసించారు. అశ్లీలత వల్ల సాహిత్యంలో అభిప్రాయాలు ఎలా మారుతూ వచ్చాయో సోదాహరణంగా వివరించారు శ్రీమతి కాత్యాయనీ విద్మహే. ప్రచార సాధనాలైన పత్రికలు, సినిమాలు, వ్యాపార ప్రకటనలలో స్త్రీ చిత్రీకరణ స్త్రీని కించ పరిచేదిగా వుందని శ్రీమతి కొండవీటి పావ నిశితంగా విమర్శించారు.

మూడవ సమావేశానికి శ్రీమతి పద్మారంగ అధ్యక్షత వహించి అశ్లీల రచనలు, వ్యాపార ప్రకటనల మీద స్త్రీలే ధ్వజ మెత్తి పోరాడాలని హెచ్చరించారు. శ్రీమతి ఆర్.అఖిలేశ్వరి అసభ్య చిత్రీకరణ శాసనాన్ని దుయ్యబట్టారు. నిషేధానికి ప్రభుత్వ అధికారులకు చొరవ ఇవ్వటం మంచిది కాదని సలహా ఇచ్చారు శ్రీ ఎం.వి.రామమూర్తి. అసలు అశ్లీలాన్ని గుర్తించటానికి ఎక్కడ, ఎలా, ఎప్పుడు, ఎవరి కోసం, ఎందుకు అనేవి గీటురాళ్ళుగా తీసుకుంటే తప్ప మనం పరిష్కార మార్గాన్ని సూచించలేమని హెచ్చరించారు శ్రీ వాసమూర్తి. వ్యాపార సంస్కృతిని నగటు సినిమాల ధోరణిని ఖండించారు శ్రీరావూరి భరద్వాజ. కుటుంబంలో తల్లి మాత్రమే అశ్లీలత వల్ల సరియైన దృక్పథాన్ని సంతానానికి అందజేయగలదని శ్రీమతి కె.అన్నపూర్ణమ్మ తదితరులు వెల్లడించారు. శ్రీమతి బి.వెంకటేశ్వరి స్వాగతం వలుకగా, వేదవతి గారి వందన సమర్పణతో ముగిసిన ఈ సెమినారులో 60 మంది స్త్రీలు పాల్గొన్నారు. 24 మంది వ్యాసాలు చదివారు, ఉపన్యసించారు. రచయితలు, మహిళా కార్యకర్తలు, లాయర్లు, లెక్చరర్లు, మేధావులు పత్రికా రచయితలు తదితర స్త్రీ విమోచన కార్య కర్తలు ఈ సదస్సులో పాల్గొనడం విశేషమని చెప్పక తప్పదు.

సమావేశం ఆఖరు రోజున—అశ్లీల సాహిత్యాన్ని సినిమాలను, వ్యాపార ప్రకటనలను రూపుమాపటానికి స్త్రీలే ముఖ్య పాత్రధారులూ సూత్రధారులూ కావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

—మల్లాది సుబ్బమ్మ